క్లుప్తంగా

ఉప్పరాపల్లిలో ఘనంగా పైడితల్లి జాతర



జాతర సందర్భంగా అన్నసమారాధన

ఎస్.రాయవరం : ఉప్పరాపల్లి గ్రామంలో శ్రీ పైడితల్లి అమ్మవారి జాతర గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామ ఇలవేల్పుగా కొలవబడే ఈ అమ్మవారి జాతరకు భక్తులు వేకువ జామునుంచి పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి చీర, సారె సమర్పించి పసుపు కుంకుమలు అందజేశారు. అమ్మవారి ఘటాలను భారీ ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన కూడా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై అన్న ప్రసాదం స్వీకరించారు.

ఎండలతో 'ఉక్క'రి బిక్కిరి

కోటవురట్ల : మండే ఎండలకు జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. నాలుగు రోజులుగా తీవ్ర వడగాల్పులు, ఉక్కపోతతో జనం అల్లాడిపోతున్నారు. వేసవిలో అల్పపీడన ద్రోణి కారణంగా నాలుగు రోజుల పాటు చల్లదనాన్ని ఆస్వాదించిన జనం ప్రస్తుతం మళ్లీ భానుడి ప్రతాపానికి అవస్థలు పడుతున్నారు. ఉదయం 9 గంటల నుంచే సూరీడు రెచ్చిపోతున్నాడు. దాంతో రహదారులన్నీ నిర్మానుష్యంగా మారిపోతున్నాయి.

సంపద కేంద్రాలతో అదనపు ఆదాయం

మునగపాక : సంపద తయారీ కేంద్రాల ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందని ప్రత్యేకాధికారి నాగలక్ష్మి అన్నారు. వెంకటాపురం సంపదతయారీ కేంద్రాన్ని ఆమె గురువారం పరిశీలించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న స్వచ్ఛ సంకల్పం ద్వారా గ్రామాలు సస్యశ్యామలంగా తయారవుతున్నాయన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయం చేసుకొని తడి, పొడి చెత్త వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, సర్పంచ్ సుందరపు తాతాజీ, ఎంపీడీవో రవికుమార్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

గంగాదేవిపేటలో 104 సేవలు

మునగపాక : మండలంలోని గంగాదేవిపేటలో గురువారం 104 వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ అనిల్‌కుమార్ సేవలందించారు. వేసవిలో ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఎండలోకి వెళ్లేటపుడు గొడుగు, నెత్తిన రుమాలు వంటివి తీసుకువెళ్లాలని వైద్యాధికారి సూచించారు. వడదెబ్బకు గురికాకుండా ఉండడానికి ఎక్కువగా నారు తాగాలన్నారు. శిబిరాన్ని మూలపేట ఉప సర్పంచ్ మొల్లేటి దేవీచంద్ర సందర్శించారు. రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గవర్ల అనకాపల్లిలో 'గడప గడపకు' నేడు

మునగపాక : మండలంలోని గవర్ల అనకాపల్లిలో శుక్రవారం ఉదయం 6 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభమవుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే రమణమూర్తిరాజు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ లబ్ధిని వివరించడంతో పాటు ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుంటారన్నారు. పార్టీ నాయకులు,అధికారులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అచ్చియ్యనాయుడు కోరారు.

ఎన్‌ఆర్‌ఈజీఎస్‌ను బలోపేతం చేయాలి

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని పెదపాడు, జగ్గన్నపేట గ్రామాల్లో గురువారం గ్రామీణ ఉపాధి హామీ కూలీలతో సీఐటీయూ నాయకులు ఆర్.రాము సమావేశమయ్యారు. కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ఉపాధి పథకాన్ని బలోపేతం చేయాలని సూచించారు. కూలీల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

ఘనంగా దుర్గాలమ్మ పండగ

రాంబిల్లి : మండలంలో వాడ నర్సాపురం గ్రామంలో గురువారం దుర్గాలమ్మ అమ్మవారి పండగను ఘనంగా నిర్వహించారు. వాడ నర్సాపురంతో పాటు పరిసర గ్రామాల భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆలయం సహా గ్రామంలో విద్యుద్దీపాలంకరణ చేశారు. పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

జోరుగా ఉపాధి...చురుగ్గా పనులు

- 24 గ్రామాల్లో 54 చోట్ల పనులు
- 100 రోజులు పని కల్పించడమే ధ్యేయం
- 6222 మందికి జాబ్‌కార్డులు
- వేసవిలో వేతనదారులకు ప్రత్యేక సౌకర్యాలు



వడదెబ్బ తగలకుండా పనులు చేపట్టాలని అవగాహన కల్పిస్తున్న ఏపీవో హేమలత



పనులు చేస్తున్న వేతనదారులు

పాయకరావుపేట : మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులు మండలంలో చురుగ్గా జరుగుతున్నాయి. మండలంలో గల 24 గ్రామాల్లో గల ఉపాధి హామీ పథకం వేతనదారులు ముమ్మరంగా పనులు చేస్తున్నారు. మండలంలో 22 గ్రామాల్లో 54 చోట్ల పనులు చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో గల పంట కాలువలు, చెరువులు, కొబ్బరి చెట్లకు చుట్టూ నీటి కందకాలు (పాళీలు), కొండల దిగువ భాగాన వర్షం నీరు వృథాగా పోకుండా నీటి కందకాలు తవ్వడం వంటి పనులు చేపడుతున్నారు. మండలంలో 6222 మందికి ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు కలిగి ఉన్నారు. వీరిలో 3021 మంది ఉపాధి పనుల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు 100 రోజులు పని కల్పించడమే ధ్యేయంగా ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు కృషి చేస్తున్నారు. మండలంలో 2500 మంది ఎస్సీ వేతనదారులు ఉండగా 1100 మంది పనుల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. మండలంలో 307 మంది వికలాంగులకు జాబ్ కార్డులు వున్నప్పటికీ 60 మంది మాత్రమే ఉపాధి పనుల్లో పాల్గొంటున్నారు. పనులకు రాకుండా వున్న వారందరికీ అవగాహన కల్పించి అందరికీ పని కల్పించడమే ధ్యేయంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గడచిన ఆర్థిక సంవత్సరంలో 231 చోట్ల పనులు పూర్తి చేసినట్టు, ప్రస్తుతం 54 చోట్ల పనులు చురుగ్గా చేపడుతున్నట్టు అధికారులు చెప్తున్నారు. ఎప్పటికప్పుడు చేసిన పనులకు కొలతలు వేసి రికార్డులు చేస్తున్నారు. మండలంలో గల గుంటపల్లి, గోపాలపట్నం, ఈదటం, పాల్మన్‌పేట, కుమారపురం, పెంటకోట, కందిపూడి, శ్రీరాంపురం, పెదరాంభద్రపురం, ఎస్.నర్సాపురం, కేశవరం తదితర గ్రామాల పరిధిలో ఉపాధి పనులను చురుగ్గా చేపడుతున్నారు. వేతన దారులకు ఎండ, వడదెబ్బ తగలకుండా ఉదయం 5.30 గంటల నుంచి 11 గంటల వరకు పనులు ముగించే విధంగా ప్రణాళికను అధికారులు సిద్ధం చేశారు.

ఎప్పటికప్పుడు పనుల పర్యవేక్షణ



ఉపాధి వేతనదారులకు ఎండ, వడదెబ్బ తగలకుండా ఆయా ప్రదేశాల్లోనే నీడ కోసం పందిళ్లు వేసుకునే విధంగా తెలియజేశాం. పీహెచ్‌సీల ద్వారా ఫస్ట్ ఎయిడ్ కిట్స్ సదుపాయం కల్పిస్తున్నాం. ఓఆర్ఎస్ ప్యాకెట్స్ అందుబాటులో ఉంచుతున్నాం. తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నాం. ప్రతి వేతనదారుకు రోజుకి రూ.272 వేతనం చెల్లిస్తున్నాం. ఆయా గ్రామాల్లో జరుగుతున్న పనులను దగ్గరుండి వీఆర్‌పీలు పర్యవేక్షిస్తున్నారు. ప్రోగ్రామ్ అధికారి, ఎంపీడీవో పనులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు.

– ఎం.హేమలత, ఏపీవో, ఎన్ఆర్ఈజీఎస్, పాయకరావుపేట

డ్రైనేజీ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి



తోటాడలో ప్రభుత్వ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

మునగపాక : గ్రామాల్లో డ్రైనేజీల సమస్యలు పరిష్కరిస్తామని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు అన్నారు. పంచాయతీ నిధులతో పాటు గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా సచివాలయాలకు మంజూరయ్యే నిధులతో డ్రైనేజీల నిర్మాణాలపై దృష్టి సారిస్తామన్నారు. మండలంలోని తోటాడలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రభుత్వ పథకాలతో కూడిన లబ్ధిని వివరిస్తూ ప్రజా సమస్యలు అడిగి తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు మంజూరు చేస్తున్నామన్నారు. ఇళ్ల పట్టాలతో పాటు ఇళ్లు నిర్మించుకునేందుకు అవసరమయ్యే సాయాన్ని ప్రభుత్వం అందజేస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా గెలిపించుకోవడం ద్వారా మరిన్ని సంక్షేమ పథకాలు పొందవచ్చన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు, ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, పార్టీ నేతలు షేక్ ఇస్మాయిల్, దొడ్డి బాలాజీ, బుద్ద రమేష్, కాండ్రేగుల శేషు, బుద్ద రవి, కేవీఏ నరసింహనాయుడు, బొడ్డేడ లిల్లి, పిల్లి అప్పారావు, కొయిలాడ జగదీష్, సరిసా శ్రీనివాసరావు, పరమేష్, నరేంద్ర, సర్పంచ్‌లు మద్దాల ధనలక్ష్మి నాగప్పారావు, సుందరపు తాతాజీ, ఎంపీటీసీ మద్దాల వీరునాయుడు పాల్గొన్నారు.

నెలాఖరుకు రీ సర్వే పూర్తి కావాలి



కోటవురట్ల తహసీల్దారు కార్యాలయంలో సమీక్షిస్తున్న ఆర్డీవో జయరామ్

కోటవురట్ల : భూ రీ సర్వే లక్ష్యాన్ని పూర్తి చేయకుండా ఏం చేస్తున్నారు...మీరు పూర్తి చేసేంత వరకు నేను రోజూ వచ్చి ఇక్కడే కూర్చుంటా...ఎప్పటికి చేస్తారో చేయండి. అప్పటి వరకు నేనూ మీతోనే ఉంటా.. అంటూ ఆర్డీవో జయరామ్ మండిపడ్డారు. స్థానిక తహసీల్దారు కార్యాలయాన్ని ఆయన గురువారం సందర్శించి భూ రీ సర్వే గురించి తహసీల్దారు జానకమ్మ, సిబ్బందితో సమీక్షించారు. సర్వే నత్త నడకన సాగుతుండడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెలాఖరుకు రెండో దశ రీ సర్వేను పూర్తి చేయాలని ఆదేశించారు. విలేకరులతో మాట్లాడుతూ నర్సీపట్నం డివిజన్ పరిధిలో 161 గ్రామాల్లో భూ రీ సర్వే జరుగుతోందన్నారు. డివిజన్‌లో 96,677 ఎకరాలలో రీ సర్వే జరుగుతోందని, ఇప్పటి వరకు 50 గ్రామాల్లో పూర్తయిందని తెలిపారు. తహసీల్దార్ల లాగిన్‌లో 35 గ్రామాలు, తన లాగిన్‌లో 2 గ్రామాలు ఉన్నాయని, ఇవన్నీ కూడా ఈ నెలాఖరుకు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. డీటీ సోమశేఖర్, సర్వేయర్ ప్రసాద్, వీఆర్వోలు, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు గణితంలోనూ ప్రావీణ్యం సాధించాలి



విద్యార్థులకు గణితంపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

పాయకరావుపేట : ప్రతి విద్యార్థి పాఠ్యాంశాలతో పాటు గణితంలోనూ మంచి ప్రావీణ్యం సాధించాలని విశ్రాంత ఉపాధ్యాయులు తెలిపారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా గురువారం పట్టణంలో గల శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు పాఠ్యాంశాల పట్ల, గణితం, సైన్సు పట్ల అవగాహన కల్పించారు. విద్యార్థులు పురాణ, ఇతిహాసాలు చదవడం అలవర్చుకోవాలన్నారు. డ్రాయింగ్, క్విజ్, వక్తృత్వం, వ్యాసరచన, తెలుగు, ఇంగ్లిషు భాషలు అనర్గళంగా చదవడం, రాయడం, మాట్లాడం కూడా అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సనాతన సంప్రదాయాలను పరిరక్షించుకోవాలి



వాడ్రాపల్లిలో ఇంటింటా ప్రచారం చేస్తున్న దృశ్యం

మునగపాక : ప్రతి ఒక్కరూ సనాతన సంప్రదాయాలను పరిరక్షించాలని సమరసత సేవా ఫౌండేషన్ సబ్ డివిజన్ ధర్మ ప్రచారకుడు కొల్లి అప్పారావు కోరారు. వాడ్రాపల్లిలో ధర్మ రక్షణ పరిరక్షణ కోసం గురువారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయాల్లో వారంలో ఒకరోజు భజన, ప్రతి నెలా పౌర్ణమి రోజున సామూహిక హారతి కార్యక్రమం నిర్వహించాలన్నారు. గ్రామస్తులు మళ్ల శేషు, కాండ్రేగుల నూకప్పారావు, కొణతాల శివ రామకృష్ణ, మళ్ల లక్ష్మి పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణ



దిమిలి గ్రంథాలయంలో వేసవి శిబిరంలో కథలు చదువుతున్న చిన్నారులు

రాంబిల్లి : దిమిలి శాఖా గ్రంథాలయంలో ఉత్సాహంగా వేసవి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. గురువారం సైన్స్ ఫర్ బెటర్ సొసైటీ వ్యవస్థాపకుడు సీహెచ్ జగదీష్ సైన్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైన్సు ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం కథలు చెప్పడం, విద్యార్థులతో చదివించడం చేయించారు. లైబ్రేరియన్ ఎస్.శకుంతల పాల్గొన్నారు.

విద్యార్థులకు తెలుగు సాహిత్యంపై అవగాహన



గణపర్తి శాఖా గ్రంథాలయంలో తెలుగు సాహిత్యంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మునగపాక : విద్యార్థులు వేసవి సెలవుల్లో సమయం వృథా చేసుకోకుండా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని గణపర్తి మాజీ ఎంపీటీసీ మారిశెట్టి వెంకటరమణ కోరారు. గణపర్తి శాఖా గ్రంథాలయంలో గురువారం వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా తెలుగుసాహిత్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రంథాలయాధికారి లంబా అప్పలనర్సమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు. మునగపాక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి ఎల్.వి. రమణ ఆధ్వర్యంలో విద్యార్థులకు నీతి కథలు చదివి వినిపించారు. అలాగే గణితంలో మెలకువలపై ఉపాధ్యాయుడు పిల్లా జగదీష్ అవగాహన కల్పించారు.

విద్యార్థులకు నీతి కథల బోధన



నీతి కథలు చెప్తున్న విద్యార్థులు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని శాఖా గ్రంథాలయంలో గురువారం వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా నీతి కథలు చెప్పించారు. పిల్లలతో కథలు రాయించారు. ఉపాధ్యాయుడు మారిసెట్టి వెంకటప్పారావు, కోమల శర్మ, గ్రంథాలయాధికారి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మారుమూల గ్రామాల్లో మెరుగైన వైద్యం అందించాలి

కోటఉరట్ల: మారుమూల గ్రామాల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎన్‌వీడీసీపీ డీడీ రామిరెడ్డి సూచించారు. గొట్టివాడ శివారు అణుకు గిరిజన గ్రామాన్ని ఆయన గురువారం సందర్శించారు. గిరిజనుల వీధులు గృహాలను పరిశీలించి వారి ఆరోగ్య సమస్యలపై ఆరా తీశారు. వ్యాధులు వచ్చినప్పుడు నిర్లక్ష్యం వహించకుండా ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలని గిరిజనులకు సూచించారు. చిన్న చిన్న వ్యాధులను కూడా అశ్రద్ధ చేయకూడదన్నారు. గిరిజన గ్రామాల్లో పర్యటించి ఎప్పటికప్పుడు వైద్య శిబిరాలు నిర్వహించడంతోపాటు వ్యాధులపై అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎం దొర ఎంపీహెచ్‌ఈవో గోవిందరావు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్‌లైన్లకు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..



రేవుపోలవరం గ్రామంలో విద్యుత్ లైన్ల మరమ్మతు పనులు

ఎస్.రాయవరం : రేవుపోలవరం, కొత్తరేవుపోలవరం గ్రామాల్లో తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయంపై గ్రామస్తులు కొరుప్రోలు సబ్‌స్టేషన్‌కి వచ్చి ఫిర్యాదు చేసిన విషయం విదితమే. దీనిపై 'నాలుగు రోజులుగా కరెంటు లేక అవస్థలు' అనే శీర్షికన ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. ఈ మేరకు డీఈ రఘు స్పందించారు. ఈ రూట్‌లో 10 కిలోమీటర్లు మేర విద్యుత్ వైర్లు మరమ్మతులకు గురైనట్టు గుర్తించామని, అందులో 5.3 కిలోమీటర్లు వైరు వేసేందుకు మంజూరైందన్నారు. దీంతో 1.5 కిలోమీటరు పనులు పూర్తి చేశామన్నారు. రేవు పోలవరం, కొత్త రేవుపోలవరం గ్రామాల్లో కూడా పనులు చేపట్టామని, 3 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామని సరఫరా కొత్తవాటికి మార్చేలోగా గ్రామంలో బంగారమ్మతల్లి జాతర వచ్చిందన్నారు. జాతర ముగిసే వరకు విద్యుత్ సరఫరా అంతరాయం కలిగించవద్దని గ్రామ పెద్దలు చెప్పడంతో పనులు తాత్కాలికంగా వాయిదా వేశామన్నారు. ఈలోగా పాత పద్ధతిలో విద్యుత్ అంతరాయం కలిగిందన్నారు. ఈ మేరకు గురువారం నుంచి విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు చేపట్టామన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పాయకరావుపేట : పట్టణంలో గల ప్రభుత్వ ఐటీఐలో 2023–24 సంవత్సరానికి అడ్మిషన్ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఐటీఐ ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ తెలిపారు. అభ్యర్థులు ధ్రువపత్రాలను ఐ.టి.ఐ.ఎ.పి.జిఓవి.ఇన్ వెబ్‌సైట్‌లో జూన్ 6వ తేదీలోగా రిజిస్టేషన్ చేయించుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సర్టిఫికేట్స్ పరిశీలనకు కౌన్సిలింగ్ తేదీలు తెలియజేయడం జరుగుతుందని ప్రిన్సిపాల్ సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

కె.అగ్రహారంలో ఇంటింటి ధర్మ ప్రచారం



సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ధర్మ ప్రచారం చేస్తున్న కౌన్సిలర్ సంధ్య తదితరులు

యలమంచిలి : భారతదేశంలో సంస్కృతి, సంప్రదాయాలకు హిందూమతం ఎంతో పవిత్రమైందని కౌన్సిలర్ గొర్లె సంధ్య అన్నారు. గురువారం కొక్కిరాపల్లి అగ్రహారం గ్రామంలో సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులతో కలసి హిందూ ధర్మ ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హిందూ మతం సనాతన సంస్కృతి సంప్రదాయాలను కాపాడడంలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో ఆలయాలు నిర్మించి ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని అన్నారు. ప్రతి ఒక్కరూ దైవభక్తి కలిగి ఉండాలన్నారు. ఫౌండేషన్ సభ్యులు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి హైందవ సంస్కృతిపై ధర్మప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జోనల్ ధర్మ ప్రచారకులు ఆడారి గంగాధర్, మహిళా సహాయక కన్వీనర్ గొర్లె వరలక్ష్మి, మండల కన్వీనర్ పాముల శ్రీను అప్పలనాయుడు, ధార్మిక సమితి సభ్యులు పాల్గొన్నారు.

14న ఆంజనేయస్వామి జయంతికి ఏర్పాట్లు



సినిమాహాలు కూడలిలో వెలసిన పంచముఖ ఆంజనేయస్వామి

పరవాడ: స్థానిక సినిమాహాలు కూడలిలో కొలువుదీరిన పంచముఖ ఆంజనేయస్వామి జయంతిని ఈ నెల 14న నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశామని శ్రీ పైడిమాంబ యూత్ కమిటీ ప్రతినిధి బొద్దపు అయ్యబాబు చెప్పారు. ఆ రోజు వేకువ జాము నుంచి స్వామికి ప్రత్యేక హోమాలు పూజలు నిర్వహిస్తారు. పరవాడ పరిసర గ్రామాల భక్తులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసుకోవడానికి వీలు కల్పించారు. ఆలయ ప్రాంగణంలో ఆదివారం మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆరోజు రాత్రికి ఆంజనేయ స్వామిని పుర వీధుల్లో ఊరేగిస్తారు. రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని అయ్యబాబు చెప్పారు.

ప్రజాప్రతినిధుల క్రికెట్ టోర్నీ నేడు

కశింకోట : విశాఖలోని రైల్వే స్టేడియంలో శుక్రవారం ఉదయం 8 గంటలకు వైఎస్సార్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం కానున్నట్టు ఎంపీపీ కలగా లక్ష్మి, ఉగ్గినపాలెం సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు గురువారం తెలిపారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో జరిగే టోర్నమెంటులో కశింకోట, అనకాపల్లి మండలాలు, అనకాపల్లి పట్టణం నుంచి మూడు జట్లను ఏర్పాటు చేసి, టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. టోర్నీలో పాల్గొనేందుకు మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, క్రికెట్ ఆటలో ప్రవేశం ఉన్న గ్రామ స్థాయి నాయకులు, ఆటగాళ్లను ప్రోత్సహించేందుకు పార్టీ అభిమానులు హాజరుకావాల్సిందిగా కోరారు.

నిబంధనలు 'కాల్చే'స్తున్నారు!



కాల్చడానికి సిద్ధం చేసిన ఇటుకలు



సీతానగరం సమీపంలో ఇటుక బట్టీ నుంచి వెలువడుతున్న పొగ

- అనుమతుల్లేకుండా ఇటుక బట్టీల నిర్వహణ
- చెరువులు, ప్రభుత్వ భూముల్లో మట్టి తవ్వకాలు
- నాలా పన్ను ఎగవేత.. ప్రభుత్వ ఆదాయానికి గండి
- వెంకుపాలెంలో ఓ బట్టీకి రూ.40 లక్షలు జరిమానా!

మూడేళ్ల క్రితం ఇటుక ధర రూ.5 మాత్రమే. ఇప్పుడు గరిష్టంగా రూ.9 వరకూ పలుకుతోంది. సిమెంట్, ఫ్లైయాష్ ఇటుకలు అందుబాటులోకి వచ్చినా మట్టి ఇటుకల పైనే ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఇటుకల వ్యాపారానికి డిమాండ్ ఏర్పడింది. ఎక్కడికక్కడ యజమానులు ఇటుక బట్టీలు ఏర్పాటు చేస్తూ నిబంధనలు బేఖాతరు చేస్తున్నారు.

అనకాపల్లి రూరల్ : పచ్చని పొలాలు ఇటుక బట్టీలుగా మారిపోతున్నాయి. చెరువులు, సమీపంలోని జలాశయాల్లో మట్టి తరలిపోతోంది. పట్టా, ప్రభుత్వ భూమి అనే తేడా లేకుండా మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా బట్టీలకు అగ్గి పెడుతున్నారు. ఫలితంగా కాలుష్యానికి కారకులవుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా గ్రామాల్లో నిర్వహిస్తున్న ఇటుక బట్టీలపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మండలంలో 50 వరకు బట్టీలు

అనకాపల్లి మండల పరిధిలో సుమారు 50కి పైగా ఇటుక బట్టీలు ఉన్నాయి. ముఖ్యంగా తుమ్మపాల, వెంకుపాలెం, సీతానగరం, తగరంపూడి, సీతయ్యపేట, పిసినికాడ, కశింకోట, మునగపాక, తోటాడ తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఇటుక బట్టీలు నిర్వహిస్తున్నారు. వీటిలో 90 శాతానికి పైగా ఎలాంటి అనుమతులు లేకుండానే ఏర్పాటు చేశారు. అనుమతులున్నవి వేళ్ల మీద లెక్కించవచ్చు. ఇలా అనుమతులు తీసుకున్నవారు కూడా నిబంధనలు ఉల్లంఘించి పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడుతున్నారు. ధనార్జనే ధ్యేయంగా ఇటుకలను వారికి నచ్చిన ధరకు అమ్ముకుని లాభపడుతున్నారు.

భారీగా నాలా పన్ను ఎగవేత

వ్యవసాయ భూముల్లో ఏవైనా వాణిజ్య కార్యకలాపాలు నిర్వహిస్తే ఆ భూములను తప్పనిసరిగా వ్యవసాయేతర భూములుగా మార్పిడి చేసుకోవాలి. ఇందుకోసం నిర్ణీత నాలా పన్ను చెల్లించి రెవెన్యూ అధికారుల నుంచి భూ బదలాయింపు ధ్రువీకరణ పొందాలి. కానీ ఏ బట్టీ నిర్వాహకుడూ ఇలా చేయడానికి ఇష్టపడట్లేదు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. బట్టీల యజమానులు గ్రామ పంచాయతీలకు చెల్లించాల్సిన సెస్సు కూడా ఎగవేస్తున్నారు. తమ కళ్ల ముందే ఈ తతంగం జరుగుతున్నా అధికారులు ఏదైనా ఫిర్యాదొస్తేనే స్పందిస్తున్నారు. లేకుంటే ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

వెంకుపాలెం బట్టీకి రూ.40 లక్షలు జరిమానా!

మండలంలోని వెంకుపాలెం వద్ద ఓ ఇటుక బట్టీ నిర్వాహకుడు శారదానదీ గర్భం నుంచి భారీగా మట్టిని తరలించుకు పోతుండటంపై స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇటీవల అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణ, తహసీల్దార్ గంగాధరరావు తదితరులు విచారణ జరిపారు. నిబంధనలు ఉల్లంఘించి, పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడుతున్నట్టు గుర్తించారు. ఈ మేరకు నివేదిక రూపొందించి, బట్టీ యజమానికి రూ.40 లక్షలు జరిమానా విధించాలని ఉన్నతాధికారులకు సిఫార్సు చేశారు. దీంతో సహజ వనరుల దోపిడీకి పాల్పడుతున్న బట్టీ నిర్వాహకుల్లో అలజడి మొదలైంది.

పోషకాహారంపై అవగాహన

అచ్యుతాపురం (అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని గురజాపాలెంలో విజయ వాహిని ఆధ్వర్యంలో పోషకాహారంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. సీసీ వేణు, సీఎం రమణ, బ్లాక్ కోఆర్డినేటర్ హారిక, అంగన్‌వాడీ టీచర్ సూర్యకాంతం, రమణ కుమారి పాల్గొన్నారు.